# మనస్సాక్షి

హనుమంతు హత్య చేశాడని విన్నప్పుడు నేను నమ్మలేదు.

నేనే కాదు. హనుమంతుతో కొద్దిపాటి పరిచయమున్న ఏ వ్యక్తి అయినా నమ్మడుగాక నమ్మడు. అంతటి సాధుజీవి, మృదు స్వభావి.

చీమకైనా అపకారం తలపెట్టని హనుమంతు విషయంలో పోలీసులు పొరపాటుపడి ఉంటారనిపించింది. కొందరి మొహం చూస్తే మొట్ట బుద్ధి అవుతుంది. హనుమంతు మొహం అలాంటిదే. భయం గొలిపేట్టు. . . . అతన్ని చూడగానే మొట్టమొదట కలిగే అభిప్రాయం మాత్రం అతను పచ్చి నెత్తురు తాగే దుర్మార్గుడని. . పాపం ఆ విషయంలో అతనేం చేస్తాడు? పుట్టుకతోనే అందవికారంగా పుట్టాడట. దానికితోడు మొహం నిండా వికృతంగా స్ఫోటకపు మచ్చలు. తన ఆరోయేట పొరపాటున కత్తిపీట మీద పడ్డదానికి గుర్తుగా చెంపమీద అరంగుళం లోతున కత్తిగాటు . . . కుడి కంటి కింద నించి ప్రారంభమై జెర్రిపోతులా చెవి వరకూ పాకుతూ. . . .

హనుమంతుని చూద్దామని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళేముందు కూడా కొండంత ఆశ నాలో. . .అతన్ని పొరపాటుగానో, లేక కావాలనో చేయని నేరం నెత్తిమీద వేసి స్టేషన్‌కు లాక్కెళ్ళి ఉంటారని. పోలీసులకిది అలవాటే కదా. నిజమైన నేరస్థుణ్ణి పట్టుకోలేని అసమర్థతని కప్పిపుచ్చుకోడానికి ఏ అమాయకుణ్ణో బలిపశువుని చేసి, బలవంతంగా నేరం ఒప్పించటం . . . . . కానీ తీరా పోలీస్ స్టేషన్ కెళ్ళాక తెల్సింది హనుమంతు తనకు తాను వచ్చి లొంగిపోయాడని.

నన్ను చూసి హనుమంతు చిన్నగా నవ్వాడు. అటువంటి పరిస్థితుల్లో ఉండి కూడా అలా నవ్వగలగటం నిష్కపటమైన హనుమంతులాంటి వ్యక్తులకే సాధ్యపడుతుంది. అతని మొహంలో ఏరకమైన భావమూ కనిపించలేదు. నిర్వేదంగా, నిర్వికారంగా నిలబడి ఉన్నాడు. ఎప్పటికి మల్లే అతని కళ్ళు ఎర్రగా నిప్పు కణికల్లా మండుతున్నాయి. హనుమంతుని మొట్టమొదటిసారి చూసినపుడు తాగుబోతని అనుకున్న మాట వాస్తవం. ఆ తర్వాత ప్రతిరోజూ కళ్ళు అలానే ఉంటే రోజూ ఉదయాన్నే సారాయితో మొహం కడుక్కునే బాపతేమోననుకున్నా. ఆ తర్వాత తెలిసింది - అతను కాఫీ, టీలు కూడా ముట్టుకోడని - అతని కళ్ళు స్వతహాగా అలానే ఉంటాయని.

ఏం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో తెలియక ప్రతిమలా నిలబడ్డాను.

"మీరు నమ్మలేకపోతున్నారు కదూ" అన్నాడు హనుమంతు.

నాకెపుడూ ఆశ్చర్యం వేస్తూ ఉంటుంది - ఇంత మంచి సంస్కారం ఇతనికెలా అలవడిందా అని. జన్మతః సంస్కారం అబ్బుతుందనటం ఎంత పొరపాటో హనుమంతుని చూస్తే తెలుస్తుంది. ఎంత సన్నిహితమైనా "మీరు" అనే సంబోధిస్తాడు. అదేమంటే "మీరు నా కంటే వయసులో పెద్దవారు. అందుకే" అంటాడు.

మరలా తనే అన్నాడు. "నేనే చేశాను. ఆమెను గొంతు పిసికి చంపేశాను"

అతని మొహంలోకి బాధగా చూశాను. కాని అతనిలో అలాంటి ఛాయలు కన్పించలేదు. పశ్చాత్తాపపడ్తున్నట్లు కూడా లేదు. పైపెచ్చు ఓ రకమైన సంతృప్తి కన్పిస్తోంది.

తను అలా ఎందుకు చేశాడో వివరంగా హనుమంతు నాకు చెప్పాడు. అతను నేరం ఒప్పుకున్నాడు కాబట్టి న్యాయస్థానం తప్పకుండా అతనికి శిక్ష విధిస్తుంది. కానీ నా మనస్సాక్షికి మాత్రం అతను క్షమార్హుడనే అన్పిస్తుంది. నాకు హనుమంతు గురించి తెల్సిన విషయాలన్నీ పూస గుచ్చినట్లు చెప్తేనే కాని అతని నేరం ఏ పాటిదో నిర్ణయించటం మీకు సాధ్యపడదు.

హనుమంతు అనాథ. చెత్తకుండీలో చావు బ్రతుకుల మధ్య వూగిసలాడ్తుంటే

ఎవరో దయామయుడు దేవుళ్ళా వచ్చి కాపాడి అనాథాశ్రమంలో అప్పగించి వెళ్ళాడట.

తన తండ్రి గురించి మాట్లాడటానికి ఇష్టపడని హనుమంతు తల్లి గురించి మాత్రం కటువుగా ఒక్క మాటనడం నేనెపుడూ విన్లేదు.

"మా అమ్మ అందగత్తెగాకున్నా నాలా అందవిహీనంగా మాత్రం ఉండి ఉండదు. ఎటొచ్చీ పెళ్ళికి ముందే తొందరపడటం వలన లోకానికి భయపడి నన్ను చెత్తకుండీలో వదిలేసిందా లేక వద్దనుకున్నా వచ్చిన మాతృత్వం తన వృత్తికి అడ్డమని అయిష్టమైనా సరే నన్ను దూరం చేసుకుందా అనే విషయం ఎప్పటికీ నాకు అంతుచిక్కదు. నేను దొరికిన చెత్తకుండీకి దగ్గరగా ఉన్న పేట నిండా వేశ్యలే కాబట్టి నా తల్లి కూడా వేశ్య అయి ఉండటానికి అవకాశం ఎక్కువ సాగర్ బాబూ. ఇలా ఆలోచిస్తే నాకు అవమానంగా అన్పించదు. మీరు నమ్మినా, నమ్మకున్నా అది నిజం. ఆమెను తల్చుకుని గుండె ఆర్ద్రమైపోతుంది. ఇలా అను కోవటంలో మరో తృప్తి ఉంది తెలుసా సాగర్‌బాబూ- నేను అందవికారంగా ఉన్నానన్న కోపంతో నన్ను వదిలి ఉండదన్న నమ్మకం. కేవలం తన పొట్ట పోసుకోవటమే కష్టంగా ఉండి- మరో ప్రాణి తనకు బరువనీ తన వృత్తికి చెరుపనీ వదిలేసి ఉంటుంది. ఏ అమ్మ అయినా అలా తన బిడ్డని అందంగా లేదన్న కారణంతో వదిలేయగలదంటే నాకు నమ్మశక్యం కాదు".

తన తల్లి వేశ్య అయి ఉంటుందని చెప్పేటప్పుడు కూడా హనుమంతులో ఏరకమైన భావమూ కన్పించదు. చాలా సాధారణ విషయంలా చెప్తాడు.

"పాపం తనైనా ఏం చేస్తుంది! జానెడు పొట్ట కోసం ఏ కురూపితోనో కళ్ళు మూసుకుని ఉంటుంది. నేను పుట్టి ఉంటాను" అని నవ్వేస్తాడు.

హనుమంతుని అకస్మాత్తుగా ఎవరైనా చూస్తే తప్పకుండా భయపడతారు. అతని కళ్ళు, ముక్కు, నోరు ఏవీ సక్రమంగా సరియైన స్థానాల్లో ఉండవు. నల్లగా, బలంగా ఉంటాడు. స్ఫోటకపు మచ్చలు . . . . కుడిచెంప మీద కత్తిగాటు. . . . కానీ అతనితో ఓ నిమిషం మాట్లాడ్తే చాలు అతన్ని తప్పకుండా ఇష్టపడతారు. అంత సౌమ్యంగా, మృదువుగా మాట్లాడటం అతనికే తెలిసిన గొప్పకళ.

సినిమాల్లో చూపించినట్లు దుర్మార్గులు గళ్ళలుంగీల్తో, గారలుపట్టిన పళ్ళతో, ముఖం నిండా కత్తిగాట్లతో, క్రూరంగా కన్పిస్తారను కోవటం ఉత్తట్రాష్ అని హనుమంతుని చూస్తే అర్థమైపోతుంది. అసలు అటువంటి గత జీవితం కలిగి ఉండి కూడా సమాజం మీద ద్వేషాన్నో, పగనో పెంచుకోకుండా ప్రేమను పెంచుకోవడం వింతే. తన తల్లి తనని నిర్దాక్షిణ్యంగా చెత్తకుండీలో పడేసిందని కినుక వహించాల్సింది పోయి - ఆ తల్లి మీద ఎంతటి ప్రేమో . . . . ఎంత జాలో. . . .

"మనం మన కోణంలోంచే ఆలోచిస్తే అందరూ చెడ్డవాళ్ళుగా, దుర్మార్గులుగా అన్పిస్తారు సాగర్ బాబూ - వాళ్ళ కోణంలోంచి మనం చూడగలగాలి. వాళ్ళకున్న పరిమితులూ, ప్రొద్బలాలు, అగత్యాలు - వారి కష్టాలు, కన్నీళ్ళు. . . . వీటిని దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే చాలా మంది చేసింది ఒప్పుగానే అన్పిస్తుంది. నా తల్లి నన్ను వదిలేసే ముందు తప్పకుండా ఏడ్చి ఉంటుంది. స్త్రీ కదా. . . నేనింకో విధంగా వూహించనైనా లేను" అని చెప్పే హనుమంతు మీద బోల్డంత ఇష్టం ఏర్పడుతుంది.

హనుమంతుకి వేశ్యలంటే వల్లమాలిన జాలి.

"వేశ్య అనే పదం ఎంత నీచమైన అర్థంలో వాడతారో తెలిసి చాలా బాధ వేస్తుంది సాగర్ బాబూ. . ఓ పురుగుకన్నా హీనంగా బురదలో దొర్లే పంది కన్నా అసహ్యంగా. . ఏం - వాళ్ళు మాత్రం మనుషులు కారా? వాళ్ళకూ రక్తమాంసాల్తో పాటు మనసనేది ఒకటుంటుందని వీళ్ళందరూ ఎందుకు గుర్తించరూ! వాళ్ళకూ సంఘంలో గౌరవంగా తల యెత్తుకుని బ్రతకాలనే ఉంటుందన్న నిజాన్ని వీళ్ళెందుకు ఒప్పుకోరూ! కానీ ఆకలి. . . . మనం అసహ్యించు కోవాల్సింది గౌరవంగా ఆకలినిచల్లార్చుకునే అవకాశం కల్పించని ఈ సంఘాన్ని" తమాషాగా అలా నిరసిస్తున్నప్పుడు కూడా అతని మొహంలో కోపమో, అసహ్యమో నాకు కన్పించేవి కావు.

అతను నిజంగా రుషి. . . హిమాలయాల్లోనో అడవుల్లోనో తపస్సు ఆచరించకున్నా జీవితంలోని కఠోరసత్యాల్ని తన జిజ్ఞాసతో ఆకళింపు చేసుకున్న తాత్వికుడు.

హనుమంతుకి కోపం రావడం నేనేపుడూ చూడలేదు. పిల్లలు అతని రూపాన్ని ఎగతాళి చేయటం చూసి, కోపంతో నేను మండి పడినపుడల్లా -

"పోనీండి సాగర్ బాబూ - పిల్లలు దేవతల్తో సమానం. వాళ్ళకు నా రూపం ఆనందాన్ని కల్గిస్తుందంటే అది నాకూ సంతోషమే. అయినా నిజాలనించి దూరంగా పారిపోవాలని నేనెపుడూ కోరుకోలేదు. నేను అందవికారంగా ఉంటాననేది వాస్తవం. దాన్ని తల్చుకుని నేను బాధ పడటమో - ఆత్మన్యూనతతో క్రుంగి పోవటమో చేయను. నేను ఎలా ఉన్నా నేను నేనే కదా" అని హాయిగా నవ్వేస్తాడు.

అనాధాశ్రమంలో పెరిగినా చక్కని నడవడికతో, తన మంచితనంతో అందర్నీ ఆకట్టుకునే హనుమంతు - శ్రద్ధగా చదువుకుని బ్యాంకులో ఉద్యోగం తెచ్చుకున్నాడు.

అతి నిరాడంబరంగా బ్రతకటం ఎలానో అతన్నుంచి నేర్చుకోవల్సిందే. వూరికి దూరంగా ఓ చిన్న గది అద్దెకు తీసుకున్నాడు. ఎంత దూరం అయినా నడిచేవెళ్తాడు. హోటల్‌కు పిల్చినా రాడు, తనే వంట చేసుకుంటాడు. తన కోసం వీలైనంత తక్కువ ఖర్చుచేసుకుని మిగతా డబ్బంతా బ్యాంకు ఖాతాలో దాచి పెడ్తుంటాడు.

"ఏం చేస్తారు ఈ డబ్బంతా" అంటే " నా తల్లిలాంటి ఒక్క స్త్రీ ఉద్ధరణ కోసం ఈ డబ్బు వినియోగించబడినా చాలు - నా జీవితం ధన్యమైనట్లే" అంటాడు.

అటువంటి హనుమంతు హత్య చేశాడంటే. . .

ఆ రోజు ఏం జరిగిందో హనుమంతు నాకు చెప్పిన విషయాన్ని యథాతథంగా మీకు చెప్తాను.

ఆ రోజు హనుమంతు అబిడ్స్‌లోని తాజ్‌మహల్ హోటల్ దగ్గర నిలబడి ఉన్నాడు. అప్పుడు టైం రాత్రి తొమ్మిది కావస్తోంది. అతని కెందుకో వెంటనే ఇంటికి వెళ్ళాలనిపించలేదు. కొన్ని నిముషాలు తనకు సమీపంలో నిలబడి ఉన్న వ్యక్తుల్ని పరిశీలనగా చూశాడు.

అతని దృష్టిని సమీపంలో నిలబడి ఉన్న ఓ అమ్మాయి ఆకర్షించింది. ఆమె ఎముకల గూడులా ఉంది. మొహానికి పూసుకున్న చవకబారు మేకప్ వల్ల ప్రేతఃకళ

ప్రస్ఫుటంగా కన్పిస్తోంది. నిలబడటానికి కూడా ఓపికలేనట్టు - గోడకు జారగిలబడి నిలబడింది. ఆమెవైపు చూసే ప్రతి మగాడినీ వస్తావా అన్నట్టు పిలిచి నవ్వుతోంది. ఆమె నవ్వు శవం నవ్వినట్లు వికృతంగా ఉంది. చూడటానికే అసహ్యం వేస్తున్న ఆమెను చూసి అందరూ ఛీదరించుకుని వెళ్ళిపోతున్నారు.

ఒకరిద్దరు రిక్షావాళ్ళు ఆమెకు దగ్గరగా వెళ్ళి నిలబడ్డారు.

"ఎంత" అని అడిగాడు.

"పది రూపాయలు" ఆమె ఆశగా అంది.

"నీ మొహానికి పది రూపాయాలా - థూ" నోట్లోని బీడి ముక్కని తీసి, తుపుక్కున వూస్తూ అన్నాడొకడు.

"పోనీ - అయిదు . . . ."

"దండగ" అన్నాడతను రిక్షాని ముందుకులాగుతూ. . . .

"ఎంతిచ్చినా పర్లేదు. అన్నం తిని రెండ్రోజులయింది" ఆమె దీనంగా చేతులు జోడించింది.

అప్పుడు కలుక్కుమంది హనుమంతు గుండె.

అతనెప్పుడూ వేశ్యల దగ్గరకు వెళ్ళలేదు. అటువంటి ఏ స్త్రీని చూసినా అతనికి వాళ్ళమ్మే గుర్తుకు వస్తుంది.

ఆ క్షణం - ఆమెనలా చూస్తుంటే తన అమ్మ దీనంగా నిలబడి ఓ మగ మృగాన్ని తన శరీరాంగాలతో ఆడుకుని నాలుగు డబ్బులు విదిల్చమని అర్థిస్తున్నట్టే అన్పించింది.

జేబులు తడిమి చూసుకున్నాడు. వందరూపాయల కాగితం కొంత చిల్లరా దొరికింది.

"ఈ డబ్బు చాలు తన తల్లి ఆకలి తీర్చడానికి" అనుకున్నాడు. అతని మనసులో వేరే భావం లేదు. మాతృమూర్తి మీద మమకారం తప్ప.

ఆమెకు దగ్గరగా వెళ్ళాడు.

"వస్తావా" అందామె ఓపికను తెచ్చుకుంటూ.

గోడకు అటువైపు ఏపుగా పెరిగిన బోగన్ విల్లియా చెట్టు నీడ హనుమంతు ముఖం మీద పడ్తోంది.

అతనిలో అంతులేని కోరిక! ఒక్కసారి . . . . ఒకే ఒకసారి అమ్మ ఒడిలో పడుకోవాలనీ.

"హనుమంతు నించి ఏరకమైన సమాధానం రాకపోయేటప్పటికి దాన్ని అంగీకారంగా అర్థం చేసుకుని "ఇక్కడికి దగ్గరే. వెళ్దాం పద" అని ఆమె ఓ క్షణం ఆగింది.

అనుమానంగా "పది రూపాయలు - ఉన్నాయికదా" అంది. "పది రూపాయలేం ఖర్మ - నా జీవితం అంతా నీ పాదాల ముందు పరుస్తానమ్మా" అనుకున్నాడు హనుమంతు. తన దగ్గర డబ్బులు ఉన్నాయన్నట్లు తలవూపాడు.

తన తల్లి కూడా అచ్చం ఇలానే. . . . బలహీనంగా - దీనంగా - మగవాడి దయా దాక్షిణ్యాల కోసం యాచించి. . ఎప్పుడూ లేనిది ఓ కన్నీటి చుక్క అతని కళ్ళలో మెరిసింది.

ఆమె కదలి ముందుకునడిచింది. అతనూ కదిలి ఆమెకు పక్కగావచ్చి నిలబడ్డాడు - భక్తిగా - గౌరవంతో - పూజ్యభావంతో.

అప్పుడు. . . . చూసిందామె - అతనిమీద పడ్తున్న ట్యూబ్ లైట్ కాంతిలో. అప్రయత్నంగా సన్నటి కేక పెట్టింది.

ఆశ్చర్యపోయి చూశాడతను. ఆమె మొహం నిండా అసహ్యం . . . . ఆమె కళ్ళనిండా తిరస్కార భావం . . . .

"ఛీ - నీతోనా ? నీ మొహం ఎప్పుడైనా అద్దంలో చూసుకున్నావా ? వాంతి కొచ్చేట్టుంది" అని వెనుదిరిగింది.

అప్పుడు. . .అప్పుడు రియాక్ట్ అయ్యాడు హనుమంతు.

అతనికి జ్ఞానం వచ్చిన క్షణం నుండీ ఇప్పటి వరకూ కొన్ని వందల మంది తన మొహాన్ని చూసి అసహ్యించుకుని ఉంటారు.

అతని మొహం మీదే చీదరించిన సందర్భాలు ఎన్నో . . . . అయినా అతనెప్పుడూ బాధపడలేదు. వాటికి రియాక్ట్ కాలేదు. చాలా క్యాజువల్‌గా. . . . నవ్వుతూ. . . . వాటిని సహించాడు.

కానీ ఇపుడు . . . . ఇపుడు అంటున్నది తన తల్లి. తను చూడకున్నా - వూహించి, ఆరాధించిన తల్లి! తను మనసారా ప్రేమించిన తల్లి!

తను ఏమైనా భరించగలడు - కానీ ఏ తల్లీ తన పిల్లల కురూపితనాన్ని అసహ్యించు కోవటం మాత్రం తను సహించలేడు. ఏ తల్లీ తన కొడుకుని ఛీత్కరించటం తను భరించలేడు.

అంతే - అతన్లో ఉన్మాదం ప్రవేశించింది. . .

పిచ్చిగా అరుస్తూ ఆమె మెడని బలంగా ఒడిసి పట్టుకున్నాడు.

అతనిలో అంతులేని పశుబలం - అనంతమైన కసి. . . . ఆమె చనిపోయేదాకా గొంతు పిసుకుతూనే ఉన్నాడు.

ఆమె చనిపోయాక కానీ అతని కోపం చల్లారలేదు.

అప్పుడు ప్రశాంతంగా నడుచుకుంటూ వెళ్ళి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

● మయూరి వీక్లీ, మార్చి 1, 1996 ●